

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | శుక్రవారం | నవంబర్ 10, 2023 | www.navatelangana.com



రేవంత్‌రెడ్డి అసత్యపు ప్రచారాలు మానుకోవాలి

- రేవంత్ వ్యాఖ్యాలను ఖండించిన నాయకులు
- నేడు కాంగ్రెస్ రెబల్ క్యాండెట్‌గా నామినేషన్ దాఖలు చేయనున్న సంజీవ్ రెడ్డి

5లో...



పంచాయితీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా రాజన్న
- పంచాయితీ కార్మికల సంఘం ఆధ్వర్యంలో డీపీవోకు వినతి

6లో...

అగ్రనేతల ప్రచారం.. అభ్యర్థుల్లో అభయం..!



- ఉమ్మడి జిల్లాలో పర్యటించిన సీఎం..రెండో విడతకు రాక
- ఇక వరుసగా సాగనున్న రేవంత్‌రెడ్డి సభలు
- ఘాటైన విమర్శలతో హీటెక్కుతున్న ఎన్నికల సమరం
- భారీ సభలతో జనాలను ఆకర్షించే ప్రయత్నం
- ఎటువైపు మొగ్గుచూపుతారోననే సర్వత్రా ఆసక్తి

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ఊపందుకుంటోంది. ఆయా అభ్యర్థుల తరపున పార్టీల అగ్రనేతలు ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తుండటంతో ఎన్నికల సమరం మరింత రసవత్తరంగా మారుతోంది. అగ్రనేతల రాక అభ్యర్థుల్లో అభయాన్ని నింపుతోంది. వారి ప్రసంగాలతో జనాలు ఆకర్షితులవుతుండటంతో గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించి బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపగా.. రెండో విడతలోనూ మిగితా నియోజకవర్గాల్లో పర్యటించేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఇక మరోపక్క కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం ఉమ్మడి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పర్యటించి ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపగా.. ఈ నెల 11వ తేదీ నుంచి మిగితా నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సైతం పర్యటించి ఆ పార్టీ శ్రేణులను ఉత్సాహ పరుస్తున్నారు. మిగితా పార్టీల అగ్రనాయకులు సైతం పర్యటిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయం హీటెక్కుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మిగతా..2లో...



వలసలతో సతమతం

- అధికార పార్టీకి ఝలక్ ఇస్తున్న ప్రజాప్రతినిధులు
- కాగజ్‌నగర్‌లో ఇద్దరు కౌన్సిలర్‌లు, సిర్పూర్(టి)లో సర్పంచ్ జంప్
- సీఎం వచ్చి వెళ్లిన మరుసటి రోజే వలసలు


కౌన్సిలర్‌ల చేరిక అనంతరం నినాదాలు చేస్తున్న బీఎస్‌పీ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. దీనితో సిర్పూరు (టి) నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్‌కు బలం పెరుగాల్సి ఉండగా, వలసలు పెరగడం ఆ పార్టీ శ్రేణులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గురువారం ఒక్కరోజే కాగజ్‌నగర్‌లో ఇద్దరు కౌన్సిలర్‌లు అధికారపార్టీ నుంచి బీఎస్‌పీలోకి జంప్ అయ్యారు. ఇది కాగజ్‌నగర్‌లో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్‌కు చెందిన ఐదో వార్డు కౌన్సిలర్ కె శ్రీలత, 22వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎ లావణ్యలు ఇద్దరు గురువారం అధికారపార్టీని వీడి బీఎస్‌పీలో చేరారు. వీరికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నీలి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్‌లు అధికారపార్టీని వీడి ఇతర పార్టీలో చేరుతున్నారని గత కొన్ని రోజులుగా కాగజ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది.

మిగతా..2లో...

కాంగ్రెస్‌కు టీజేఎస్ పూర్తి మద్దతు

- రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ బాబన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్



తెలంగాణ జన సమితి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతోందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ బాబన్న తెలిపారు. గురువారం మంచిర్యాల జిల్లా తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం ప్రజల సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి ఎజెండాను ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు. గోదావరి శాశ్వత ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని, మంచిర్యాలలో కరకట్ట నిర్మించి జనాలకు రక్షణ కల్పించాలని, గోదావరి ముంపు కారణంగా జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించాలని తెలిపారు.

మిగతా..2లో...

c m y k

నేడే ఆఖరు రోజు..!

- చివరి అంకానికి చేరిన నామినేషన్ల పర్వం
- నియోజకవర్గాల్లో సందడి వాతావరణం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల నామినేషన్ల పర్వం చివరి అంకానికి చేరుకుంది. దాఖలుకు నేడు ఆఖరు కావడంతో భారీగా వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. వారం రోజుల పాటు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించగా.. ఒక్కో నియోజకవర్గం నుంచి పదికి మించి దాఖలైనట్లు తెలుస్తోంది. దాదాపు ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసినప్పటికీ.. ఆఖరి రోజున కూడా మరో సెట్ సమర్పించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. గురువారం ఉమ్మడి జిల్లాలో దాఖలైన నామినేషన్లను పరిశీలించగా.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి కంది శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ నుంచి అగ్గిమల్ల గణేష్, భారత చైతన్య యువజన పార్టీ నుంచి జ్ఞానేష్, స్వతంత్ర అభ్యర్థులుగా అన్నం దేవేందర్, తక్బీడ్ పండిత్‌రావు, కలమడుగు విజయ్‌కుమార్, సత్యనారాయణ, గడ్డం సాయిమౌనరెడ్డి, గేడం జనార్దన్, ప్రవీణ్‌లు దాఖలు చేశారు. బోథ్‌లో బీఆర్ఎస్ నుంచి అనిల్‌జాదవ్, కాంగ్రెస్ నుంచి ఆడె గజేందర్, బీజేపీ నుంచి సోయం బాపురావు, డీఎస్పీ నుంచి ఉయికే ఉమేష్, రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ ఉయికే హిరాజీ, స్వతంత్రులుగా జాదవ్ భోజ్యానాయక్, తొడసం ధనలక్ష్మీ, వన్నెల అశోక్ దాఖలు చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్ నుంచి జాన్సన్ నాయక్, కాంగ్రెస్ నుంచి వెడ్మ బొజ్జు, బీజేపీ నుంచి రాథోడ్ రమేష్, బీఎస్పీ రాథోడ్ కళ్యాణి, స్వతంత్ర అభ్యర్థులుగా మోహన్, జాదవ్ రవికిరణ్‌లు దాఖలు చేయగా.. నిర్మల్‌లో బీఆర్ఎస్ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కె.మాధురిరావు, బీజేపీ నుంచి మహేశ్వర్‌రెడ్డి, బీఎంపీ నుంచి గొర్రె లింగన్న, డీఎస్పీ నుంచి రామగిరి రవీందర్, ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ నుంచి కోవలక్ష్మీ, కాంగ్రెస్ నుంచి శ్యాంనాయక్, గోండ్వాన గణతంత్ర పార్టీ నుంచి ఆత్రం గోవర్ధన్, బీఎంపీ నుంచి బుక్య పల్లవి, స్వతంత్ర అభ్యర్థులుగా సిడాం అన్నిగా, మేస్రం నవీన్, ఆడె బాలాజీ దాఖలు చేశారు. సిర్పూర్(టి)లో బీఆర్ఎస్ నుంచి కోనేరు కోనప్ప, బీజేపీ నుంచి హరీష్‌బాబు, న్యూ ఇండియా పార్టీ నుంచి కోబ్రాగడే గమిత్రదాస్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జాడే దీపక్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థిగా దుర్గం శ్యాంరావు దాఖలు చేశారు.

చెన్నూర్‌లో బీఆర్ఎస్ నుంచి బాల్క సుమన్,కాంగ్రెస్ నుంచి గడ్డం వివేకానంద, బీజేపీ నుంచి దుర్గం అశోక్, సోషలిస్టు పార్టీ నుంచి మోతె రాజలింగు, డీఎస్పీ నుంచి నందిపాటి రాజు, స్వతంత్రుడిగా జాడి ఎర్రయ్య దాఖలు చేశారు. మంచిర్యాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా నడిపెల్లి దివాకర్‌రావు, కాంగ్రెస్ నుంచి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, బీజేపీ నుంచి వెరబెల్లి రఘునాథ్‌రావు, డీఎస్పీ నుంచి ఏ.రమేష్, స్వతంత్రులుగా మహమ్మద్ ఖలీం, అందె మంగ, తల్లూరి వెంకటేశ్వర్లు దాఖలు చేయగా.. బెల్లంపల్లిలో బీఆర్ఎస్ నుంచి దుర్గం చిన్నయ్య, కాంగ్రెస్ నుంచి జి.వినోద్, బీజేపీ నుంచి ఏ.శ్రీదేవీ, ఏ.రాజేశ్వర్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి రాంటెకి శ్రీనివాస్, బీఎస్పీ నుంచి జాడి నర్సయ్య, సీపీఐఎంఎల్ నుంచి గోగర్ల శంకర్, స్వతంత్ర అభ్యర్థులుగా దుర్గే ఈశ్వర్, పెరుగు రవీందర్ దాఖలు చేశారు. ముధోల్‌లో బీఆర్ఎస్ నుంచి జి.విఠల్‌రెడ్డి, డీఎస్పీ నుంచి కాసారం రాజు, ఇండియా ప్రజా బంధు పార్టీ నుంచి గోరె విజయ్, స్వతంత్ర అభ్యర్థులుగా జాదవ్ దేవిదాస్, బద్ధం భోజారెడ్డి, వీరేష్ నామినేషన్లు దాఖలు చేశారు. కాగా నామినేషన్ల పర్వంతో నియోజకవర్గ కేంద్రాల్లో సందడి వాతావరణం నెలకొంది.



నామినేషన్ దాఖలు చేస్తున్న కోవ లక్ష్మీ



ఊరేగింపుగా నామినేషన్ వేసేందుకు వెళ్తున్న ఐకే రెడ్డి

అగ్రనేతల ప్రచారం..అభ్యర్థుల్లో అభయం..!

(మొదటి పేజీ తరువాయి)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన పార్టీల అగ్రనేతలు ముమ్మరంగా పర్యటిస్తున్నారు. వారి పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు శాయశక్తులు ఒడ్డుతున్నారు. పదునైన మాటలతో అసెంబ్లీ ఎన్నికల సమరాన్ని మరింత రసవత్తరంగా మార్చుతున్నారు. జనాలను తమవైపు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఘాటైన విమర్శలతో రాజకీయాన్ని హీటెక్కిస్తున్నారు. పోలింగ్‌కు మరో 20రోజుల సమయం ఉండటంతో ఈ లోపు దాదాపు అన్ని నియోజకవర్గాల్లో పర్యటించేందుకు కార్యాచరణ రూపొందించారు. బీఆర్ఎస్ తరపున ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 2వ తేదీ నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. నిర్మల్, ముధోల్, చెన్నూర్, సిర్పూర్(టి), ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పర్యటించి అభ్యర్థుల్లో భరోసా నింపారు. మిగితా ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, మంచిర్యాల నియోజకవర్గాల్లో పర్యటించేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఇప్పటికే మంత్రి హరీష్‌రావు జిల్లాలో పర్యటించగా.. మంత్రి కేటీఆర్ సైతం ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీలు వర్గాలు చెబుతున్నాయి. ఇదే తరుణంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తూ ఆ పార్టీ శ్రేణులను ఉత్సాహ పరుస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో పర్యటించిన ఆయన మిగిలిన వాటిలోనూ ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 11వ తేదీన బెల్లంపల్లిలో జరిగే సభకు హాజరవడంతో పాటు మిగిలిన వాటిలోనూ ప్రచారం నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారవుతుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోపక్క ఈ నెలాఖరున జిల్లాలో ఆ పార్టీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ లేదంటే ప్రియాంకగాంధీలలో ఒకరు ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సైతం జిల్లాలో పర్యటిస్తూ ఆ పార్టీ శ్రేణుల్లో భరోసా నింపుతున్నారు.

పదునైన మాటలతో హీటెక్కిన ప్రచారం

ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ఆయా పార్టీల అగ్రనాయకులు పదునైన విమర్శలు, మాటలతో ఎన్నికల సమరాన్ని మరింత హీటెక్కిస్తున్నారు. రాష్ట్రంలో ఈపదేండ్లలో చేపట్టిన అభివృద్ధితో పాటు ప్రతిపక్షాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయా సభల్లో విరుచుకుపడుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్‌పైనే ఎక్కువ విమర్శనస్త్రాలు సంధిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో తెలంగాణ పరిస్థితి..ఈ పదేండ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రాంతం వెనుకబాటుకు గురైందని ఎత్తిచూపుతూనే.. 3గంటలే విద్యుత్ సరిపోతుందని.. రైతుబంధు ఉండదని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేసినట్లు ఆయా సభల్లో ప్రస్తావిస్తూ జనాన్ని తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు సంధిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి చోటుచేసుకుందని..ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడుతున్నారు. ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెబుతూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీల అగ్రనాయకులు ఆయా పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. అగ్ర నాయకుల సభలకు భారీ సంఖ్యలో హాజరవుతున్న జనాలు చివరకు ఎవరికి అనుకూలంగా ఓటు వేస్తారు..? మరోసారి బీఆర్ఎస్‌ను గద్దెనెక్కిస్తారా..కాంగ్రెస్‌ను ఆదరిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఆదిలాబాద్ నియోజకవర్గంపై అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం శాంతినగర్ కాలనీలోని పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయంలో ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించిందని అన్నారు. కాంగ్రెస్ హయంలో విపరీతమైన కరెంటు కోతలు ఉండేవని, వేసవి వస్తే తొమ్మిది గంటల కరెంటు మాత్రమే ఇచ్చేవారని గుర్తు చేశారు. క్రమం తప్పకుండా మంచినీటి సరఫరా ఇవ్వడం కూడా కాంగ్రెస్ హయంలో సాధ్యం కాలేదన్నారు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నియోజకవర్గ పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక పరిస్థితులపై కనీస అవగాహన లేకుండా ఆ పార్టీ అభ్యర్థి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తున్న కారు గుర్తు పార్టీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవతెలంగాణ-తలమడుగు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండలంలోని సోనాపూర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని సిరికొండ గ్రామానికి చెందిన నిమ్మల శ్రీకాంత్‌రెడ్డి(45) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతుడు శ్రీకాంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి తన సొంత గ్రామమైన సిరికొండకు వెళ్లగా సోనాపూర్ గ్రామ సమీపంలో లింబుగూడ గ్రామానికి చెందిన టేకం భీంరావు నడుచుకుంటూ వెళ్లగా శ్రీకాంత్ రెడ్డి మోటార్ సైకిల్‌తో ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో శ్రీకాంత్‌రెడ్డికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దెబ్బలు తాకడంతో రిమ్స్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు తరలించగా మార్గమధ్యంలో చనిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం భీంరావు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

ఘనంగా దండారి ఉత్సవాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదివాసుల ప్రధాన పండుగైన దండారి ఉత్సవాలు ఏజెన్సీ ప్రాంతాలలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన లోహార, లింగుగూడ గ్రామాల్లో గురువారం నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ మేరకు ఆదివాసుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందజేయాలని చిట్యాల సుహాసినిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదవ్‌రావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు టీజేఎస్ పూర్తి మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

నవతెలంగాణ-ఆదిలాబాద్

కడెం డ్యామ్ కు మరమ్మత్తులు చేపట్టి, కడెంపైన కుఫీ రిజర్వాయర్‌ను నిర్మించి, కడెం క్రింద ఆయకట్టలను స్థిరీకరించాలన్నారు. తుమ్మిడి హెట్టి నిర్మించి మంచిర్యాల జిల్లాలో సాగు భూమికి నీరు అందించాలని, ఓపెన్ కాస్ట్ గనులను నిలిపివేసి అండర్ గ్రౌండ్ గనులు త్రవ్వి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. మంచిర్యాల వ్యవసాయం పాడి అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు రామచందర్ రెడ్డి, నాయకులు బచ్చలి ప్రవీణ్ కుమార్, సిరాజ్ పాల్గొన్నారు.

వలసలతో సతమతం

(మొదటి పేజీ తరువాయి)

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీఎం పర్యటన తర్వాత ఈ వలసలు పెరుగుతాయని ఊహాగానాలు వ్యాపించినా వీటిని కౌన్సిలర్‌లు కొట్టి పారేశారు. కాని గురువారం ఒకేసారి ఇద్దరు కౌన్సిలర్‌లు గులాబీ కండువాను వీడి నీలి కండువా కప్పుకోవడంతో ఇంకెంత మంది కౌన్సిలర్‌లు పార్టీని వీడుతారోననే చర్చ జోరుగా కొనసాగుతోంది.

సిర్పూరు (టి)లో..

సిర్పూరు (టి) మండలంలోని పారిగా పంచాయతీ అధికారపార్టీ సర్పంచ్ డుర్కె లక్ష్మి గురువారం బీఎస్పీలో చేరింది. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన లక్ష్మి, గెలిచిన రెండు రోజులకే బీఆర్ఎస్‌లో చేరింది. ప్రస్తుతం ఆ పార్టీని వీడి బీఎస్పీలో చేరింది.

బెజ్జూరులో..

బెజ్జూరు మండలం తలాయి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు కువిడె తారాబాయి, లంగారి సతీష్‌లు గురువారం బీఎస్పీలో చేరారు. వీరికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నీలి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇతర మండలాలలో కూడా..

నియోజకవర్గంలోని దహెగాం, చింతలమానెపల్లి మండలాలలో ఇటీవల అధికారపార్టీ నుండి వరుసగా వలసలు వెళుతున్నారు. దహెగాం మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ షేక్ షాకీర్, దహెగాం ఉప సర్పంచ్ ఎల్కరి ప్రశాంత్, వార్డు సభ్యురాలు నాగుల లక్ష్మి, నల్లి అశోక్, చిన్నగుడిపేట మాజీ ఎంపీటీసీ నాగయ్య, పంబాపూర్ మాజీ సర్పంచ్ ఎర్గటి చిన్నక్క, మొట్లగూడ వార్డు సభ్యుడు బబ్లు ఇటీవలే అధికారపార్టీని వీడి బీఎస్పీలో చేరారు. అదేవిధంగా అధికాపార్టీకి చెందిన కొంచవెల్లి మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్, మాజీ ఎపీటీసీ పసుల భారతి, కొత్మీర్ మాజీ సర్పంచ్ నాయికిని మల్లేష్, హత్ని ఉప సర్పంచ్ కొండ్ర రాజాగౌడ్‌లు బీజేపీలో చేరారు. అదేవిధంగా చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్-2 సర్పంచ్ సుశీల్‌మండల్, టేకంగూడ ఉప సర్పంచ్ ఫనీందర్‌లు అధికారపార్టీని వీడి బీజేపీలో చేరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
శుక్రవారం నవంబర్ 10, 2023

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి మాధవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు, జామ్, యకర్‌పల్లె గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మొదటి రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, రెండో రకం ధాన్యానికి రూ.2183 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ. సలీం, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఐకే రెడ్డి గెలుపునకు చామన్‌పల్లి గ్రామస్తుల పాదయాత్ర

నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గెలుపు కోరుతూ మండలంలోని చామన్‌పల్లి గ్రామస్తులు గురువారం పాదయాత్ర చేపట్టారు. గ్రామం నుంచి నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసం వరకు పాదయాత్ర సాగింది. ముందుగా గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించగా బీఆర్ఎస్ నాయకులతో పాటు గ్రామ పెద్దలు వీరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘు నందన్ రెడ్డి, చామన్‌పల్లి సర్పంచ్ పడిగేల గంగాధర్, కన్వీనర్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఒస రాజేశ్వర్, ఉప సర్పంచ్ రమణ, నాయకులు జహీర్, బొమ్మన రాజేందర్, మధు, సుదర్శన్, శ్రీనివాస్, రాజేశ్వర్, గంగారెడ్డి, ఉల్వాజీ రాజు, సురేష్, నరేష్, చిన్నారెడ్డి, భూమారెడ్డి, రవీందర్, సాయన్న పాల్గొన్నారు.



పాదయాత్రగా బయలుదేరిన గ్రామస్తులు

దోపిడికి వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

భూమి, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం తమ ప్రాణాలను అర్పించి అమరులైన వారి ఉద్యమ స్ఫూర్తితో దోపిడి పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గంగన్న అన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్ గ్రామంలో ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ అమరవీరులు భూమి, పేద ప్రజల విముక్తి కోసం ఎంతో మంది ప్రాణాలను అర్పించారన్నారు. అయిన దేశంలో నిజమైన స్వాతంత్ర్యం రాలేదన్నారు. ప్రజలు అనేక రకాల దోపిడీ, పీడకు గురవుతున్నారన్నారు. దోపిడి పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అప్పుడే అమరవీరులకు నిజమైన నివాళులర్పించినట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ మండల నాయకులు లింగన్న, ఆశన్న, కిషన్, సాయన్న, ముత్తన్న, గంగామణి, లక్ష్మి పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో విఠల్ రెడ్డి పూజలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి అమ్మవారి సన్నిధిలో గురువారం ముధోల్ బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. తన నామినేషన్ పత్రాలను, బీ ఫామ్‌ను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, ముధోల్‌లో విజయం సాధించి మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమావ్యక్తం చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా ముధోల్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామారావ్, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్‌రావు, పార్టీ కన్వీనర్ కొర్వా శ్యామ్, నర్సురి కార్తీక్‌రావు, మల్కన్నాయాదవ్, అమృత్ పటేల్, నర్సురి నరేష్ రావు, ప్రతాప్ రావు, అరుణ్ రావు, బలరాజ్ గౌడ్ పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి, నాయకులు

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-కుభీర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన కుభీర్ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఎదుల విఠల్ (35) బుధవారం సాయంత్రం సమయంలో దోడార్నా గ్రామ చెరువులోకి ఎండ్రికాయలు పట్టడానికి వెళ్లి వస్తానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు అయితే రాత్రి అయిన విఠల్ తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం పూట కుటుంబ సభ్యులు విఠల్ ఆచూకీ గురించి చెరువు సమీపంలో వెతకగా మధ్యాహ్నం చెరువులో పడి ఉన్నట్టు గుర్తించారు. దీంతో మృతుడి తండ్రి గంగారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై యశ్వంత్ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ముధోల్ అసెంబ్లీ స్థానానికి ఎనిమిది నామినేషన్‌లు

నవతెలంగాణ-ముధోల్

నామినేషన్ల పర్వం ప్రారంభమైన ఏడవరోజు గురువారం ముధోల్ అసెంబ్లీ స్థానానికి ఎనిమిది నామినేషన్‌లు దాఖలయ్యాయి. ముధోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి.విఠల్‌రెడ్డి మూడు నామినేషన్ సెట్లను రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డికి అందజేశారు. ముధోల్ ధర్మ సమాజ్ పార్టీ డీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసరం రాజు రెండవ నామినేషన్ సెట్‌లు అలాగే ముధోల్ అసెంబ్లీ స్థానం నుంచి జాదవ్ దేవిదాస్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక నామినేషన్, స్వతంత్ర బద్దం భోజారెడ్డి ఒక నామినేషన్ సెట్, ఇండియా ప్రజాబంధు పార్టీ నుంచి గోరె విజయ్ ఒక నామినేషన్ సెట్, అలాగే స్వతంత్ర అభ్యర్థిగా వీరేశ్ ఒక నామినేషన్ సెట్‌ను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో గురువారం టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంతో పాటు ఆయ గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను కలిసి సంఘ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఏ.లక్ష్మి ప్రసాద్ రెడ్డి, తోడిశెట్టి రవికాంత్, పోల ధర్మరాజ్, మేడారపు శ్రీనివాస్, కరిపె శివప్రసాద్, శరత్‌చందర్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-బాసర

గోదావరి నది తీరంలో గురువారం గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై గణేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు ఇచ్చిన సమాచారం మేరకు గోదావరి నదిలో బ్రిడ్జి సమీపాన మృతదేహం ఉందన్న సమాచారం మేరకు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించినట్టు తెలిపారు. మృతురాలి వయస్సు(35) సంవత్సరాల వరకు ఉంటుందని, మృతురాలు ఎరుపురంగు చుడీదార్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉంది. మరే ఇతర ఆధారాలు లభించలేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే బాసర పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

హుండీలను అందించిన యూనియన్ బ్యాంక్

నవతెలంగాణ-బాసర

శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి ఆలయానికి యూనియన్ బ్యాంక్ తరపున రెండు స్టీల్ హుండీలను విరాళంగా అందజేశారు. గురువారం బ్యాంక్ రీజనల్ మేనేజర్ శంకర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సన్నిధిలో రూ. లక్షా నలభై వేల విలువ గల రెండు హుండీలను ఆలయ ఏఈఓ సుదర్శన్ గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ పూజారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ సంజీవ్ రావ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు

ముధోల్ బీఎస్పీ అభ్యర్థిగా సర్దార్

నవతెలంగాణ-ముధోల్

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకుడు సర్దార్ వినోద్ కుమార్‌ను టికెట్ కేటాయించింది. మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన ఆయనకు పార్టీ అభ్యర్థిత్వం ఇచ్చింది. గురువారం హైదరాబాద్‌లో ఆయనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయానంద్, రాష్ట్ర కోఆర్డినేటర్ విజయ్ ఆర్య బీఫాం అందించారు. శుక్రవారం ఆయన పార్టీ తరపున నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-నిర్మల్

ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సౌకర్యాల గురించి తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బస్సుల నిర్వహణ, బస్సు సమయంలో మార్పులు, సూచనలు, సలహాలు తెలియచేసే వారు సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు సెల్ నెం. 9959226003కు ఫోన్ చేయాలని సూచించారు.

సీఈఐఆర్ ద్వారా ఫోన్ గుర్తింపు



నవతెలంగాణ-నిర్మల్

పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి పోలీసులు అప్పగించారు. వివిధ పోలీసు స్టేషన్లలో ఫోన్ పోగొట్టుకున్న 311 మందికి జిల్లా ఎస్పీ చల్లా ప్రవీణ్ కుమార్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోయిన ఫోన్లను గుర్తించేల నూతన సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి 311 ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకొని వారి యజమానులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరన్న, డీఎస్ఆర్బీ డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ రమేష్, ఐటీ కోర్ ఎస్సై రవి కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ

గెలిపించుకునే బాధ్యత కార్యకర్తలపై ఉంది

• ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్

నవతెలంగాణ-ఉట్నూర్

పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత కార్యకర్తలపై ఉందని నియెజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, జెడ్పి చైర్మెన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఏపీపీఎస్సీ సభ్యుడు రవీందర్ రావ్‌లతో కలిసి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా ఆయన కార్యకర్తలకు దిశ నిర్దేశ్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలన్నారు. పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. ఇటీవల జరిగిన ఓ పార్టీ సభలో రెండు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన రేఖ నాయక్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంతోనే మతిభ్రమించి సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన పెట్టిన భిక్షతో ఎమ్మెల్యే పదవీ వచ్చిందన్న విషయాన్ని మరిచారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆస్తులను పెంచుకున్నారే తప్ప ఎలాంటి అభివద్ధి చేశారని ప్రశ్నించారు. వెంటనే రేఖా నాయక్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం జాన్సన్ నాయక్ మండలంలో పలు దేవాలయాల్లో పూజలు చేసి, ప్రచారంలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన జిల్లా క్రీడాకారుడు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

38వ జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌లో జిల్లా క్రీడాకారుడు సత్తా చాటాడు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో లాంగ్ జంప్ విభాగంలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 5.98 మీటర్ల దూరం దూకి రజత పతకం సాధించాడు. బజార్హత్నూర్ మండలం జాతర్ల ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన మడావి సోము జాతీయ స్థాయిలో రాణించడం పట్ల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, పి.రాజేష్, పీఈటీల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు అభినందించారు.

నేడు షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్-14, 17 సంవత్సరాల విభాగంలో బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాంతారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి అర్హత కలిగిన క్రీడాకారులు తమ సొంత రాకెట్‌తో ఉదయం 10 గంటలకు పోటీల కన్వీనర్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ గౌడ్, నిర్వాహకుడు వినోద్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

బౌద్ధ బోధకుల సత్కార సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

బౌద్ధ బోధకుల సత్కార సభను విజయవంతం చేయాలని ఆ కార్యక్రమ నిర్వాహకులు దుర్గం శేఖర్ అన్నారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక కైలాస్‌నగర్‌లోని అశోక బుద్ధ విహారలో మధ్యాహ్నం ఒంటిగంటకు సమతా ఫౌండేషన్, బుద్దిస్ట్ మైత్రి సంఘం సంయుక్త సంఘాల ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆషాడ పౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకు బుద్ధుని జీవిత చరిత్రపై బోధన చేసిన 70 మంది ప్రబోధకులను గుర్తించి సత్కరించడం జరుగుతుందని వివరించారు. ఈ సప్త కంజరి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహారాష్ట్రకు చెందిన సత్యపాల్ మహారాజ్ హాజరవుతారని తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో బౌద్ధమతం సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెప్తూ బౌద్ధ, ధమ్మ గ్రంథాలను మూడు నెలల పాటు బోధించిన వారిని ఆ సభలో సత్కరిస్తారని వెల్లడించారు. బౌద్ధ ఉపసిక, ఉపసకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సన్మాన కార్యక్రమ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సమావేశంలో సమత ఫౌండేషన్ అధ్యక్షులు అనిల్ సాప్లే, గంగారం బొర్కర్, దయానంద్ కాంబ్లె, దయానంద్ నర్వాడే, లక్ష్మికాంత్ కాంబ్లె, తుకారాం జీవానే, సత్యవాన్ చిటికె, రవీంద్ర జవానే, రఘునాథ్ పవర్, గుల్షన్ బన్సోడే, గౌతమ్ సింగ్‌నాకర్, జనార్దన్ సూర్యావంశీ, రాజు హట్కారే, సూరజ్ సోన్ కాంబ్లె, రాహుల్ జాందడే, నిశాంత్ దౌనే పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడా పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్స్, చెస్ క్రీడల్లో కళాశాల స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ పి. భరద్వాజ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడాల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించడంతో పాటు క్రీడల ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాల అధిపతులు రాజ్ కుమార్, క్రాంతి కుమార్, సుజయ్, రాజన్న, అనిల్ కుమార్, పరిపాలన అధికారి రాజేష్, వ్యాయామ అధ్యాపకులు కుమారస్వామి, అధ్యాపకులు శ్రీనివాస్, గజానంద్ రావు, రామేశ్వర్ రెడ్డి, సుధాకర్, రవి కుమార్, నీల్ కమల్, విజయలక్ష్మి ఉన్నారు.

అగ్రవర్ణ పార్టీలపై డీఎస్పీ ధర్మ యుద్ధం షురూ



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అగ్రవర్ణ పార్టీలపై డీఎస్పీ ధర్మ యుద్ధం షూరు అయ్యిందని ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. గురువారం పట్టణంలో ర్యాలీగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ ర్యాలీ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీగా ప్రధాన వీధుల గుండా ధర్మ సమాజ్ పార్టీ వర్ధిల్లాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్, కుమురంభీం, బీర్సా ముండ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకుని రెండో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అగ్రవర్ణ పార్టీలపై ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం మొదలైందని అన్నారు. పేదల రాజ్యం నిర్మిస్తేనే ప్రజాస్వామ్యం బతికి బట్ట కడుతుందని పేర్కొన్నారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం కోస ఓటు హక్కును వినియోగించుకొని తమ పార్టీకి అండగా నిలవాలని కోరారు. అగ్రవర్ణ మూడు పార్టీలు ఒకటేనని వాటి సిద్ధాంతం ఒకటేనని అణగారిన వర్గాల జీవితాలలో వెలుగు నింపేదే ధర్మసమాజ్ పార్టీ టార్చ్ లైట్ గుర్తని పేర్కొన్నారు. ఇప్పుడున్న మూడు పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అగ్రవర్ణ పార్టీలేనని 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల విముక్తి కోసం వచ్చిందే ధర్మ సమాజ్ పార్టీ అని తెలిపారు. బహుజనులందరూ ఏక తాటి పైకి వచ్చి టార్చ్ లైట్ గుర్తుకు ఓటు వేసి ధర్మ సమాజ్ పార్టీనీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీఎస్పీ పార్టీ నాయకులు శ్రీనివాస్, గంగన్న, రాజీవ్, ఒమన్న, పవన్, నవీన్, అమ్మ నాయకురాలు శ్యామల, మంజూష, శ్రీవాణి, సుష్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ చోరీ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సాకేర గ్రామానికి చెందిన జాదవ్ విద్యాసాగర్‌కు చెందిన మోటర్ సైకిల్ చోరికి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు వారి లాగా వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు అంతర్‌రాష్ట్ర రోడ్డు పక్కన గ్రామ సమీపంలోని మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద పార్కింగ్ చేసి చేనుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి పార్కింగ్ చేసిన చోట మోటార్ సైకిల్ కనబడక పోవడంతో ఆందోళన చెందారు. దీంతో బాధితుడు గురువారం బోథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

విష ప్రచారాలు చేసినా గెలుపును ఆపలేరు

• కాంగ్రెస్ బహిరంగసభ సక్సెస్‌తో శ్రేణుల్లో నూతనోత్సహం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ఎన్ని విష ప్రచారాలు చేసినా, ఎన్ని అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించినా, ఆరునూరైనా కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, సీనియర్ నాయకులు సంతోష్‌రావు అన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి మద్దతుగా డైట్ కళాశాల మైదానంలో చేపట్టిన విజయభేరి సభ విజయవంతమైందని అన్నారు. ఇందుకుగాను సహకరించిన పార్టీ శ్రేణులు, ప్రజలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. విజయభేరి సభకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా అశేషజనం తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయిందన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న తన అనుచరులతో సభ రద్దవుతుందని సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేయించారని ఆరోపించారు. కానీ వారి పప్పులు ఉడకలేదన్నారు. అందుకు భిన్నంగా స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారన్నారు. పదిహేనేండ్లుగా జోగు రామన్న చెబుతున్న మోసపూరిత మాటలను, ఇస్తున్న హామీలను ప్రజలు ఇక నమ్మేస్థితిలో లేరని అన్నారు. కంది శ్రీనివాసరెడ్డిని రాజకీయంగా బద్నాం చేయాలని ప్రయత్నిస్తే అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. సభతో ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని స్పష్టంగా తెలిసిపోతుందని అన్నారు. టికెట్ ఆశించిన సీనియర్ నాయకులు పార్టీని విడారని, ఆదిష్టానం వారితో మాట్లాడనుందని, త్వరలో వారు కూడా కాంగ్రెస్‌లో వస్తారని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాంరెడ్డి, దీలిప్, ముదికొండ రమేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కనీస మద్దతు ధరకే వరిధాన్యం కొనుగోలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కనీస మద్దతుధరకే వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్యామల దేవి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 2023-24(ఖరీఫ్) వానాకాలం వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర క్వింటాల్ కి ఏ-గ్రేడ్ రకం రూ.2వేల203, సాధారణ రకం రూ.2వేల 183 లతో కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. మద్దతు ధర పొందాలంటే రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. మద్దతుధర, తేమ, నాణ్యత ప్రమాణాలు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం పోస్టర్‌లను, కరపత్రాలు అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జె.సుధారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి టి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి అసత్యపు ప్రచారాలు మానుకోవాలి

● రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీనియర్లు అయినటువంటి అభ్యర్థులకే ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని మాజీ మంత్రి రామచంద్రారెడ్డి చెప్పిన మాటలను మార్చి టీపీసీసీ రేవంత్‌రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డైట్ మైదానంలో బుధవారం నిర్వహించిన ప్రజా విజయభేరి సభలో మాజీ మంత్రి రామచంద్రరెడ్డి యువకుడైన కంది శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని సూచించినట్లు మాట్లాడిన మాటలు సరైనవి కావని అన్నారు.

రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ నియోజకవర్గ టికెట్ల విషయంలో అబద్ధపు మాటలు మాట్లాడారని మండిపడ్డారు. మాజీ మంత్రి రామచంద్రరెడ్డి ఆదిలాబాద్ నియోజకవర్గంలో సీనియర్ అయిన మాజీ ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాతకు, లేదా మాజీ డీసీసీ అధ్యక్షుడైన తనకు, ఇదే కాకుండా మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవరెడ్డి అయిన ఈ ముగ్గురిలో ఎవరికైనా టికెట్ ఇవ్వాలని సూచించారన్నారు. కానీ టీపీసీసీ రేవంత్‌రెడ్డి విజయభేరి సభలో పూర్తిగా అబద్ధాలు మాట్లాడాలని విమర్శించారు. అదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా కంది శ్రీనివాస్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని దివంగత నేత మాజీమంత్రి రామచంద్ర రెడ్డి చెప్పినట్లు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గతంలో మీడియాతో మాట్లాడిన వీడియోను చూపించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డబ్బులు ఉన్న వారు, ఆర్ఎస్ఎస్ బావజాలం కలిగిన వారికి కాంగ్రెస్ టికెట్లు కేటాయించారని ఆరోపించారు.

కనీస జ్ఞానం లేకుండా అబద్ధాలు మాట్లాడిన రేవంత్...

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఒక హోదాలో ఉండి కనీస జ్ఞానం లేకుండా అన్ని అబద్ధపు మాటలు మాట్లాడి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నించారని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆరోపించారు. రేవంత్ రెడ్డి జుటకోర్ రెడ్డి అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీలో కష్టపడితే తమకు పదవులు వచ్చాయని రేవంత్ రెడ్డి ఇవ్వలేదని పేర్కొన్నారు.

నేడు ర్యాలీతో రెబల్‌గా నామినేషన్ వేస్తున్నా...

మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంజీవరెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తీరును ఖండిస్తూ, ఈనెల 10న ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. నిజమైన కాంగ్రెస్ వాదులు తమ వెంట ఉన్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి మాజీ మంత్రిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి కష్టపడిన వారికి టికెట్ కేటాయించకుండా ప్యారాష్యూట్ లీడర్లకు కేటాయించారన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, నామినేషన్ వేస్తున్నామని ప్రజలు తమను ఆశీర్వదించాలని పేర్కొన్నారు.

గడప గడప బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని యాపల్‌గూడ, రామాయి గ్రామంలో గురువారం ఎంపీపీ గండ్రత్ రమేష్ గడప గడప ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్నకు ఓటేయాలని కోరారు. ఆదిలాబాద్ మండలానికి అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు చేయడం జరిగిందని తెలిపారు. అదిలాబాద్ మండలం నుంచి అత్యధిక మెజార్టీతో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే జోగు రామన్నని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జంగుపటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనక రమణ, ఆరె నరేష్, సేవ్వ జగదీష్‌యాదవ్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని కొత్త కుమ్మరివాడ, గణేష్ నగర్‌లో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గురువారం వివిధ వార్డుల్లో పర్యటిస్తూ మేనిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరించారు. అందరితో కలిసి ఉన్న వ్యక్తి ఎమ్మెల్యే జోగు రామన్న అని గుర్తు చేస్తూ తమ పార్టీ గుర్తు కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. తమ పార్టీ సంక్షేమ పథకాలు ప్రజలతో మంచి బంధాన్ని ఏర్పరచుకున్నాయని. వాటితోపాటు ఏప్రిల్ నెల నుంచి మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందనున్నాయని అన్నారు. తాము అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ ప్రజల నుంచి విశేష స్పందనను పొందుతూ ఉంటే ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి పట్ల విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీలత లక్ష్మణ్, పట్టణ అధ్యక్షులు అజయ్, మిషు, ప్రకాష్, తిరుపతి, వినోద్, పొచ్చన్న, ఇబ్బు, సునీల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

నవతెలంగాణ-తాంసి

బీజేపీలో చేరుతున్నట్టు ఒక దినపత్రికలో వచ్చిన వార్తలో వాస్తవం లేదని పార్టీ మారే ప్రసక్తే లేదని తాంసి, భీంపూర్ జెడ్పీటీసీలు తాటిపల్లి రాజు, కుమ్ర సుధాకర్ స్పష్టం చేశారు. గురువారం తాంసి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్‌తో పాటు మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న ఒక దినపత్రికలో మేము బీజేపీ పార్టీలో చేరుతున్నట్టు వచ్చిన వార్తలో వాస్తవం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. మమ్ములను సంప్రదించకుండా ఇలాంటి వార్తలు సృష్టించి రాయడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో తాంసి కన్వీనర్ అరుణ్, ఎంపీపీ మంజుల శ్రీధర్, కొఆర్డినేటర్ గోవర్ధన్ రెడ్డి, నాయకులు కాంతారెడ్డి, శ్రీనివాస్, రజినీకాంత్, ఉత్తం, పలువురు ఉన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

నవతెలంగాణ-తలమడుగు

బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. గురువారం లింగి, లాల్‌గడ లక్ష్యంపూర్, సోనాపూర్, మల్కుగూడ, రుయ్యాడి గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు అనిల్ జాదవ్‌కు గుస్సాడిలు స్వాగతం పలికారు. గ్రామ యువకులు, అనిల్ జాదవ్ సమీక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల అన్ని వర్గాల ప్రజలు కారుగుర్తుకు ఓట్లు వేసి దీవించాలని కోరారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే పరిపాలన కొనసాగిస్తుందని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించినట్లయితే నియోజకవర్గంలోని గ్రామాలను దఫాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానన్నాడు. కాంగ్రెస్ బీజేపీ పార్టీలు ఇన్నేండ్ల పాలనలో ఏం అభివృద్ధి సాధించారో ప్రజలకు తెలుసునని అన్నారు. ఎన్నికల ప్రచారంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి నగేష్, ఆ పార్టీ నాయకులు వెంకటేష్, కేదారీశ్వర్‌రెడ్డి, గంగాధర్, జీవన్ రెడ్డి, దాస్, స్వామి, కనపర్తి చంద్రకాంత్, అశోక్, రామ్‌కిషన్, ప్రకాష్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కాంగ్రెస్ హయాంలో ప్రజల ఒరిగిందేమి లేదు

● ఎమ్మెల్యే జోగు రామన్న



బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు, యువకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

అరవై అయిదేండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ హయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోకారి గ్రామానికి చెందిన పలువురితో పాటు టైలర్స్ కాలనీకి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్దే లక్ష్యంగా సాగుతున్న ప్రభుత్వంపై ఆ పార్టీ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కర్ణాటకలో అసమర్థ పాలనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఏం సాధిస్తుందని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూర్పాటి భూమన్న, యాసం నర్సింగ్‌రావు, సాజీదోద్దీన్, బుట్టి శివకుమార్ పాల్గొన్నారు.

ఇంటింటా జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికి జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. గురువారం మండల కేంద్రంతో పాటు మరపగూడ, దేవాపటార్ తదితర గ్రామాల్లో పార్టీ ఇచ్చిన మేనిఫెస్టో హామీలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మీని గెలిపిస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివద్ధి చెందుతుందని వివరించారు. ఆయా గ్రామాల్లో నాయకులు సమావేశాలు నిర్వహిస్తూ తెలంగాణ ప్రభుత్వ హాయంలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీనీ గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావ్, జనరల్ సెక్రటరీ ఖాసీ, మోరే నర్సింగ్, దాదే అలీ, యాదవ్‌రావ్, సర్పంచ్ యాదవ్‌రావ్, అబ్జల్ ఖాన్ ఉన్నారు.



బీఆర్ఎస్ పార్టీని ఆధరించాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఎన్నికల సమయంలో హామీ ఇవ్వనటువంటి పథకాలను కూడా ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న బీఆర్ఎస్‌ను ఆధరించాలని బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుధవారం జరిగిన ప్రజల ఆశీర్వాద సభను విజయవంతం చేసిన ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్థానిక సెలవు ప్రత్యామ్నాయ రోజుకు మార్పు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత నెలలో జరిగిన కుమురంభీ వర్ధంతి సందర్భంగా సెలవు ప్రకటించి దానికి బదులుగా ఈ నెల రెండవ శనివారం విద్యాసంస్థలకు పని రోజుగా ఇచ్చిన ఉత్తర్వులు సవరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శాంతి కుమారి, ఇందురావులు కోరారు. కలెక్టర్ హేమంత్ బొర్కాడేను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత నెల 28వ తేదీన కుమురంభీం వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటించి ఈ నెల 11న రెండవ శనివారం విద్యా సంస్థలకు పని దినముగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, మరుసటి రోజే దీపావళి పండుగ ఉండడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగ, ఉపాధ్యాయుల దృష్ట్యా ఈ నెల 11న రెండవ శనివారాన్ని యధావిధిగా కొనసాగించి, డిసెంబర్ 9 (రెండవ శనివారం) రోజు పని దినంగా మార్పు చేయాలని కోరారు. అనారోగ్యం, ప్రసూతి, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాలలో వాస్తవికత ఆధారంగా ఉపాధ్యాయులు ప్రత్యేక, సాధారణ సెలవులు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ప్రత్యేక సందర్భాలలో వాస్తవికత ఆధారంగా దరఖాస్తు చేసినట్లయితే సెలవులు అనుమతించడం జరుగుతుందని తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు కాంపెల్లి ఊశన్న, హరీష్ పాల్గొన్నారు.

పంచాయతి కార్మికులకు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. డీపీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విజయకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ గ్రామపంచాయతీలో సిబ్బంది విధినిర్వహణలో భాగంగా మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, కరెంట్ సరఫరా ముఖ్యమైన పనులతో పాటు పంచాయతీలోని అనేక పనులు గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల పనులు చేస్తున్నారన్నారు. అదనంగా పంచాయతీలో పనిచేస్తున్న కారోబార్లను బీఎల్ఓలుగా ఎన్నికల విధులు పనులు చేయించుకుంటున్నారని వేతనాల చెల్లింపులు మాత్రం జాప్యం చేస్తున్నారన్నారు. గత ఆరు నెలలుగా వేతనాలు లేక సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మే నెల నుంచి రూ.1000 వేతనం పెంచుతూ రూ.9500 చేసిందని అయితే అన్ని పంచాయతీల్లో ఇది అమలు కావడం లేదన్నారు. ఇప్పటికీ ఈ మొత్తం కొన్ని పంచాయతీల్లో చెల్లించడం లేదని తెలిపారు. కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం రూ. ఐదు లక్షలు అమల్లోకి తీసుకువస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలు కాలేదు అన్నారు. పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని, లేదంటే రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మేజర్ పంచాయతీ అధ్యక్షుడు మాట్ల రాజు, కార్యదర్శి సమ్మయ్య, మోత్తు, లక్ష్మి, సాగర్, రాజు, ఇస్తారి, వెంకటేష్ లు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు ఉపయోగించుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం నగదు రూపంలో అమలు చేసే అమలుచేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని జక్కాపూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రుద్రారం శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత ఎంవీ రూరల్ ఫోక్ అర్ట్స్ ఆర్గనైజేషన్ కళాజాత వారిచే బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, నగదు రహిత లావాదేవీలపై, సైబర్ మోసాలపై జాగ్రత్తలు వహించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించాలని ప్రభుత్వాలు పథకాలు అమలవుతున్నాయని, వీటిని అమలుచేసుకొనే హక్కు మీపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిప్రె ప్రభాకర్, కళాజాత బృందం సభ్యులు, మ్యూజీషియన్ తేజకుమార్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకద్రోహం చేసిన బీఆర్ఎస్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా నమ్మద్రోహం చేసింది బీఆర్ఎస్ అని సిర్పూర్ కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ విమర్శించారు. గురువారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను దోకెబాజ్ మాటలని బుధవారం జరిగిన కాగజ్‌నగర్‌లో ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 10 సంవత్సరాలుగా ప్రజలను మోసం చేసిన పార్టీ ఏదో ప్రజలకు అర్థమవుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతో బురద జల్లుతున్నారని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు ఇస్తానని ఎక్కడా చెప్పలేదని, దానిని బీఆర్ఎస్ వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. మా నాయకులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రేవంత్‌రెడ్డి కొన్ని సబ్‌స్టేషన్‌లలో లాగ్ పుస్తకాలను పరిశీలించారన్నారు. బీఆర్ఎస్ యొక్క తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్ పుస్తకాలను ప్రగతిభవన్‌లో పెట్టికున్నారని ఆరోపించారు. రైతులకు ఉచిత కరెంటు ఇచ్చిన ప్రభుత్వం మొట్టమొదటి సారిగా కాంగ్రెస్ అని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రికి తెలవదా అని ఆయన ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నియోజకవర్గంలో ఏ అభివృద్ధి చేశారో చెప్పకుండా ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడగడం సరికాదన్నారు. ముఖ్యంగా సాగునీటి విషయంలో గత 10 సంవత్సరాల నుండి ఏ ఒక్క రైతుకు సాగునీరు అందలేదని, తుమ్మిహేటి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించినప్పుడు నోరు మెదపని వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షకిల్ హైమద్, నాయకులు ఇప్ప రవిశంకర్, ముసీద్, కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రాస్పల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నుండి వివిధ పాఠశాలకు బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పాఠశాలలో గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మడవి హనుమంతు, దెబ్బటి సత్యనారాయణ, ఉపాధ్యాయుడు తంగడపల్లి రాకేష్ బదిలీపై వెళ్ళారు. వీరిని రాస్పెల్లి పరిధిలోని కాంప్లెక్స్ ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకూరి సత్యనారాయణ, ముఖ్యఅతిథిగా ప్రధానోపాధ్యాయులు బైరి వరలక్ష్మి హాజరై మాట్లాడారు. విద్యార్థులు అభ్యున్నతికాక్షించి పాఠశాలను అన్ని రంగాలలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపి, ఎన్ఎంఎంఎస్, పదోవ తరగతి ఫలితాల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఏటుకూరి శ్రీనివాసరావు, ఇందారపు ప్రకాష్, మహిపాల్, శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్, కిరణ్, సునీత, రాజమణి, ఆఫ్తాబ్, సంతోష్, నాగేష్, ఝాన్సీ, గాయత్రి, దివ్యశ్రీ, రవికుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును ఉద్దేశించి సీనియర్ సివిల్ జడ్జీ, లీగల్ సర్వీస్ కార్యదర్శి కె యువరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి విద్యార్థిని, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. 1985లో లీగల్ సర్వీస్ ప్రారంభించి 1995లో నవంబర్ 9న న్యాయ విజ్ఞాన సదస్సుగా పేర్కొనడం జరిగిందని ఆయన తెలిపారు. చట్టం ముందు అందరు సమానమేనని, చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. అదేవిధంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు తమ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఎన్నికల్లో తమ ఓటును సరైన వారిని ఎన్నుకొనే విధంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎండీ జాకీర్ ఉస్మాన్, సీనియర్ అడ్వికేట్ నరహరి, అంజలి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదిలాబాద్ : దివ్యాంగుల చైతన్య వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా అదనపు పాలనాధికారి మోతిలాల్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దళితబంధుతో సహా ఎస్టీ, బీసీ, మైనారిటీ, లకు అందించే రుణాలల్లో దివ్యాంగులకు ఐదు శాతం, జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో 5శాతం కేటాయించాలని అన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా ఖాళీ స్థలం ఉన్న దివ్యాంగులకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన దివ్యాంగులందరిని జిల్లాలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలను తక్షణం భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఔట్సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే ఉద్యోగాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మెడపట్ల సతీష్, వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు రాచర్ల రాజయ్య, రజిత, మంద సతీష్ పాల్గొన్నారు.

ఎవరు గుండాయిజం చేస్తున్నారో ప్రజలే తేలుస్తారు

- ప్రజల ఆధరాభిమానాలు ఓర్వకే విమర్శలు
- కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

పోలీసులు ఇంతమంది ఉన్నా.. బీఆర్ఎస్ నాయకుల గుండాయిజాన్నీ అరికట్టలేకపోయారని, ఎవరు గుండాయిజం చేస్తున్నారో ఈ ఎన్నికల్లో ప్రజలే వారికి సమాదానం చెబుతారని చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం ఆయన మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, దుర్గం నరేష్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సంధర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు చెన్నూర్‌లో గుండాయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని, ఇక్కడ జరిగే ప్రతి చర్యను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అసెంబ్లీ అభ్యర్థిగా కాకుండా పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలన్నది నా అభిప్రాయమని కాని ఇక్కడి ప్రజల ఆకాంక్ష, వారి ప్రోత్సాహం, ప్రోత్బలంతోనే అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని అన్నారు. ఈ క్రమంలో ఇందారం నుంచి చెన్నూర్ వరకు చేపట్టిన ర్యాలీలో నియోజకవర్గ ప్రజలు స్వచ్చందంగా వచ్చి పాల్గొడమే కాకుండా జైపూర్ మండలంలో చేపట్టిన రోడ్ షోలో గ్రామీణ మహిళలు, యువకులు వచ్చి కాంగ్రెస్‌ను గెలిపిస్తున్నామని స్వచ్చందంగా వచ్చి చెపుతున్నారని పేర్కొన్నారు. చెన్నూర్‌లో కాంగ్రెస్‌ను గెలుపును ప్రజలు కండ్లకు కట్టినట్లు వ్యక్తం చేస్తున్న తీరుతో బీఆర్ఎస్‌లో వనుకు మొదలైందని ఎద్దేవా చేశారు. ఇది జీర్ణించుకోలేక తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై గుండాయిజం చేయడానికి పూనుకున్నారని ఆరోపించారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన సుమన్ కారును అనుమతించిన అధికారులు మా కారును అనుమతించకపోవడం బాధాకరమని ఆవేధన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు ఒక నీతి కాంగ్రెస్ నాయకులకు ఒక నీతి ఉంటుందాని ప్రశ్నించారు. అంతే కాకుండా మేము ప్రయాణిస్తున్న వాహణాన్ని ఓవర్‌టేక్ చేస్తూ మా నాయకులను మమ్మల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేసిన తీరు బాధాకరమని పేర్కొన్నారు. అయినప్పటికీ మేము మా నాయకులు సమన్వయంతో ప్రభుత్వ నియమనింబధనలకు లోబడి నామినేషన్ వేయడం జరిగిందని పేర్కొన్నారు. రిటర్నింగ్ కార్యాలయం వద్ద నియమనిబంధనలు ఉల్లఘించిన తీరును ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు సతీసమేతంగా పారిపెల్లి సమీపంలో గల కాల భైరవ ఆలయం, స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైదం రవి, చెకుర్తి సత్యనారాయణ రెడ్డి, గుడ్ల రమేష్, పైడిమల్ల నర్సింగ్, మంద తిరుమల్ రెడ్డి, అర్జున్ మహంత్, చల్ల విశ్వంబర్ రెడ్డి, రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నూరులో చిచ్చుపెట్టే ప్రయత్నం జరుగుతోంది

- కాంగ్రెస్ గుండా రాజకీయాలలుచేస్తోంది
- చెన్నూరు బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్



నవతెలంగాణ-జైపూర్

అన్నివిదాల అభివృద్ధి చెందుతున్న చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ పరోక్షంగా విమ్మర్శించారు. గురువారం ఆయన అనుచరులతో కలిసి చెన్నూరు నియోజకవార్గానికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్ని కుయ్యుక్తులు పన్నినా చెన్నూరు నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నియమనిబంధనల మేరకు నడుకుంటున్న బీఆర్ఎస్ నాయకల పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. పచ్చబడ్డ చెన్నూర్‌లో చిచ్చుపెట్టే ప్రయత్నం మొదలైందని, కాంగ్రెస్ నాయకులు గుండా రాజకీయాలకు కుట్ర చేస్తున్నారని నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతాన్ని మూడు సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా ఎదిగి బాగా సంపాదించి దేశంలో అనేక ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారని అన్నారు. నాలుగు సంవత్సరాల 11 నెలలు కన్పించని నాయకులు ఇప్పుడు చెన్నూర్‌లో అడుగుపెట్టి ఓట్లు కావాలని మీ వెంట తిరుగుతున్నారని ఇక్కడి వారి కోసం ఒక్క ఫ్యాక్టరీ కూడ పెట్టని నాయకున్ని మీరు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో సూటుకేసులు పట్టుకొచ్చి అడ్డగోలుగా లీడర్లను కొంటూ రాజకీయాన్ని కలుషితం చేసేందుకు పూనుకుంటున్నారని ఆరోపించారు. పెట్టుబడుదారుల వైపు ఉంటరా పేద బిడ్డనైన బాల్క సుమన్ కావాలా..? వ్యాపారవేత్తల వైపా.. ఉన్నత విద్యావంతుల వైపా.. వేల కోట్ల ఆస్థులున్న వారి వైపా.. వేల కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసిన నా వైపు ఉంటరా.. చెన్నూర్ ప్రజలు ఆలోచించాలని కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఏవిధంగా సుస్థిర పాలన జరుగుతుందో చెన్నూర్‌లో అదే సుస్థిర పాలన జరుగుతుందని అన్నారు. అంతకు ముందు జగన్నాథ్ ఆలయంలో పూజలు నిర్వహించి పార్టీ శ్రేణులతో ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోడ జనార్ధన్, డాక్టర్ రాజారమేష్, చెర్కు సరోత్తం రెడ్డితో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



సింగరేణి నిధులతో రామారావుపేట్ రోడ్డు

నవతెలంగాణ-జైపూర్

ఇందారం-రామారావుపేట్ మధ్య చెరువు కట్ట మీదుగా నిర్మించిన రోడ్డు ప్రభుత్వ నిధులతో చేపట్టింది కాదని, రామారావుపేట్ రోడ్డు నిర్మించామని పలుమార్లు సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొనడంలో నిజం లేదని స్థానిక కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామారావుపేట్ రోడ్డు ప్రభుత్వ నిధులతో వేసినట్లు చెప్పుకోవడంలో అర్థం లేదని, రాజీవ్‌రోడ్డులో నిర్మించిన ఫ్లైఓవర్ కూడా సింగరేణి తమ అవసరాల కోసం నిర్మించున్నదని పేర్కొన్నారు. రామారావుపేట్‌ను బొందల గడ్డగా చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు గ్రామ పంచాయతి అభివృద్ధికి ఎంత మాత్రం సహకరించలేదని ఆరోపించారు. ఒక వైపు శ్రీరాంపూర్ మరో వైపు ఇందారం ఓపన్‌కాస్ట్ గనులు తవ్విస్తుండగా కనీసం స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పించకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నామాల తిరుపతి, అగ్గు రవీందర్, ముదాం దినేష్, హరీష్ పాల్గొన్నారు.

బీఎస్పీకి మూకుమ్మడి రాజీనామాలు



నవతెలంగాణ-మందమర్రి

బీఎస్పీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్ తన కార్యవర్గ సభ్యులతో కలిసి మూకుమ్మడి రాజీనామా చేసారు. మందమర్రి ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీల నుంచి వచ్చిన జంప్ జిలానిలకు పార్టీ టికెట్ కేటాయించడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులతో కలిసి మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 2014 నుండి కష్టపడి పనిచేసి పార్టీని ముందుకు నడిపిస్తూ, బహుజన వాదాన్ని వినిపించిన తనకు టికెట్ ఇవ్వకుండా ఇతర పార్టీ నుంచి వచ్చిన వారికి పదిలక్షల ఇరవై ఐదు వేల రూపాయలకు టికెటను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అమ్ముకున్నాడని ఆరోపించారు. కష్టపడి పనిచేసిన వారికే టికెట్లు ఇస్తామని అనేక సార్లు మీడియా ముందు చెప్పిన మాటలని ప్రవీణ్ కుమార్ తుంగలో తొక్కారని విమర్శించారు. ఇప్పటికైనా పునరాలోచన చేసి ప్రజలల్లో ఆదరణ గుర్తింపు ఉన్నవారికే టికెట్ ను కేటాయించాలని సూచించారు. ప్రజాసేవ చేయడానికి ఉద్యోగానికి రాజీనామ చేసి పార్టీలో చేరిన ప్రవీణ్ కుమార్ సొంత పార్టీలో పనిచేసే వారికే న్యాయం చేయలేకపోయారని ఇక ప్రజలకు న్యాయం ఏం చేస్తారని రమేష్ ప్రశ్నించారు. బహుజన రాజ్యం సాధిద్దాం మాటలతో ప్రజలను మభ్యపెడుతూ గెలుపు గుర్రాలనే ముసుగులో టికెట్లు అమ్ముకొని అధిక డబ్బులు దండుకుంటుందని ఎద్దేవా చేసారు. ప్రవీణ్ కుమార్ చెప్పేదొకటి చేసేది మరొకటని ఇలాగైతే బహుజన రాజ్యం ఎప్పటికి సాధించలేమని ఆవేదన వ్యక్తం చేసారు. సమావేశంలో పులిపాక శ్రీనివాస్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సైదం శ్రీనివాస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, ఎండీ యాకూబ్, మండల అధ్యక్షుడు చిలువేరి రవిందర్, పట్టణ అధ్యక్షుడు కల శ్రీకాంత్, మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, కార్యదర్శి గుడికందుల తిరుపతి, రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు, పులిగంటి లక్ష్మణ్ రామకృష్ణపూర్ పట్టణ కార్యదర్శి, ఎస్‌కే రహీమ్ బాబా, మందమర్రి ముస్లీం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ రహమత్ ఖాన్ మందమర్రి ముస్లీం మైనార్టీ పట్టణ కార్యదర్శి అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరిన కొత్తపల్లి గ్రామస్థులు

నవతెలంగాణ-భీమారం

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామస్థులు గురువారం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూర్ మాజీ జడ్పీటీసీ మూల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వార్డ్ మెంబర్ బందం శ్రీనివాస్ రెడ్డి పలువురు నాయకులతోకలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



జిల్లా పోలీస్ అబ్జర్వర్‌గా అశోక్ గోయల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్‌కు చెందిన ఇన్స్‌పెక్టర్ జనరల్ (ఐజీ) అశోక్ గోయల్ జిల్లాకు పోలీస్ అబ్జర్వర్‌గా వచ్చారు. గురువారం జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సాదరంగా జిల్లాకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా శాంతిభద్రతల నిర్వహణ, ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర, జిల్లా చెక్ పోస్టులు, ఇప్పటి వరకు పట్టుబడిన అక్రమ సరుకు, డబ్బు, మద్యం, ఎన్నికల సమయంలో కేంద్ర బలాగాల వినియోగింపు, సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టబందోబస్తును ఏర్పాటు చేసినట్టు ఎస్పీ వివరించారు. పోలింగ్ రోజు ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేసేల చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

సందేహాలు ఉంటే సంప్రదించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్న తనను సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు గణేష్, బాపురావు పాటిల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులతో పాటు సాధారణ ప్రజలు కూడా ఎన్నికల సరళిపై ఎలాంటి సందేహాలు తెలుసుకోవచ్చానని చెప్పారు. ఖర్చుల వివరాలు, ఇతర వివరాలను కూడా తెలియజేస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు స్థానిక పెన్‌గంగా విశ్రాంతి భవనంలో తనను నేరుగా కలవవచ్చని, లేదా చరవాణి నెంబర్ 8143876384కు సంప్రదించి ఎన్నికల సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్రజలే నా బలం.. బలగం

- హ్యాట్రిక్ విజయం సాధిస్తా.. ఐకేరెడ్డి



ఆర్‌ఓకు నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న ఐకే రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

నియోజకవర్గ ప్రజలే నా బలం, బలగమని, ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి విజయం సాధిస్తానని నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుంచానని, మడోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రజలు గర్వపడేలా మరింత అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. గురువారం ఆయన నామినేషన్ వేశారు. జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి రాంషన్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, కౌన్సిలర్ నల్లూరి పోశెట్టితో కలిసి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. తన నివాసంలో పూజలు చేసినంతరం ప్రచార వాహనంలో తిరుగుతూ తమ పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. తన నామినేషన్ సందర్భంగా జన సందోహన్ని చూస్తుంటే, హ్యాట్రిక్ విజయం సాధిస్తాననే నమ్మకం వచ్చిందన్నారు. పోలింగ్ వరకు ఇదే ఉత్సహంతో పని చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి సహకారంతో నిర్మల్ జిల్లాగా ఏర్పడిందన్నారు. మెడికల్ కాలేజ్, కలెక్టరేట్ కాంప్లెక్స్, ఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేసుకుని ప్రజల వద్దకు పాలన తెచ్చామని గుర్తు చేశారు. వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సాగునీటి కోసం ప్రాజెక్టులు, కెనాల్, చెక్ డ్యాం నిర్మాణాలు చేసి సాగునీరు అందిస్తున్నామని వివరించారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ తరహాలో ఒక్క పథకం అయిన అమలు చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. టికెట్లు కొనుక్కొని ఎన్నికల నిలబడ్డ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

పార్టీ వీడుతున్న వారికి నో ఎంట్రీ...

కొంత మంది స్థానిక ప్రజాప్రతినిధులు తమ స్వప్రయోజనాల కోసం ఎన్నికల సమయంలో తల్లిలాంటి బీఆర్ఎస్‌ని వీడుతున్నారని ఐకే రెడ్డి అన్నారు. అలాంటి వారికి తిరిగి పార్టీలో స్థానం కల్పించేది లేదని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. మూడోసారి కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమావ్యక్తం చేశారు.

జిల్లాలో ప్రధాన పార్టీల నామినేషన్ దాఖలు

- బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు
- కాంగ్రెస్ అభ్యర్థి శ్యాం నాయక్ భారీ ర్యాలీ



ఆర్‌ఓకు నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న కోవ లక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి నాందిగా నిలిచిన నామినేషన్ల ప్రక్రియ చివరి అంకానికి చేరుకోగా గురువారం జిల్లా కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పార్టీ ఎంత బలంగా ఉందో తెలియజేసే బలపరీక్షలు చేస్తూ తమ నామినేషన్లను ప్రధాన పార్టీల అభ్యర్థులు వేశారు. ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా బుధవారం వరకు కేవలం మూడు నామినేషన్లు దాఖలు కాగా గురువారం ఒక్కరోజే పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు అయ్యాయి. బీఆర్ఎస్ తరపున కోవలక్ష్మి రెండు సెట్లు, కాంగ్రెస్ తరపున శ్యాం నాయక్ మూడు సెట్లు, గోండ్వానా గణతంత్ర పార్టీ నుండి ఆత్రం గోవర్ధన్ రెండు సెట్లు, బహుజన ముక్తి పార్టీ నుండి భూక్య పల్లవి, స్వతంత్ర అభ్యర్థులుగా సిడాం అన్నిగా, మెస్రం నవీన్, అడే బాలాజీలు నామినేషన్లు దాఖలు చేశారు.

బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి ప్రత్యేక పూజలు...

బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి తన నామినేషన్ పత్రాన్ని ఆర్‌ఓకు అందించారు. ముందుగా కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో భర్త సోనేరావు, కూతురు జెడ్పీటీసీ అరుణ, కుమారుడు సాయినాథ్‌లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ నాగేశ్వరరావు, నాయకులు సరస్వతితో కలిసి వెళ్లి ఆర్‌ఓ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ తన నామపత్రాలను ఆర్‌ఓకు అందించారు.

కాంగ్రెస్ అభ్యర్థి శ్యాం నాయక్ భారీ ర్యాలీ...

కాంగ్రెస్ అభ్యర్థి శ్యాం నాయక్ నామినేషన్ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా ఆర్‌ఓ కార్యాలయానికి డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖనాయక్, నాయకులు మంగతో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించారు.



ఆర్‌ఓకు నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న శ్యాం నాయక్

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-బేల

మండలంలోని కీర్తన డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు సినిమా పాటలపై నృత్యాలు చేస్తూ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మానసిక వ్యక్తిత్వ నిపుణుడు మురళీదర్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తే విజయం సాధ్యమవుతుందన్నారు. ప్రణాళికతో పాటు జీవితంలో లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ ప్రైవేట్ యాజమాన్య అసోసియేట్ అధ్యక్షులు రవీందర్ గౌడ్, వ్యక్తిత్వ నిపుణులు గిరి, బేల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్, జయకర్, శంకర్, కీర్తన డిగ్రీ కళాశాల చైర్మెన్ పవన్‌కుమార్ అగర్వాల్, ప్రిన్సిపాల్ వేముగంటి వరప్రసాద్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కొలాటంలో పాల్గొన్న బొజ్జు



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లక్కారంలో రాజ దేవ్‌షా గూడలో దండారి వేడుకల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. ఆదివాసుల ఆరాధ్య దైవమైన ఏత్మసూర్ దేవతకు ప్రత్యేక పూజలు చేసి దండారి సభ్యులతో కలిసి కొలాటం ఆడారు. కమిటీ సభ్యులు స్వాగతం పలికి సన్మానించారు. సంస్కృతిని చాటేల దండారి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వాహణ

- అప్రమత్తంగా విధులు నిర్వహించాలి
- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేల అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. గురువారం ఆర్డీఓ కదం సురేష్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమక్షంలో ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారుల మొదటి రాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలల్లోని 597 పోలింగ్ కేంద్రాల్లో 896 మంది ప్రిసైడింగ్ అధికారులు, 896 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1,792 మంది ఇతర పోలింగ్ అధికారుల కేటాయింపు ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, అకౌంటింగ్ బృందాలను నియమించామన్నారు.

నిన్న బీజేపీ.. నేడు కాంగ్రెస్



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిన్న బీజేపీ.. నేడు కాంగ్రెస్‌లో చేరిన మండలంలోని కంజర్ సర్పంచ్ చేరిక జిల్లా వ్యాప్తంగా చర్చనీయంశమైంది. అధికార బీఆర్ఎస్‌కు చెందిన కంజర్ సర్పంచ్ శోభరాణి ప్రభాకర్ బుధవారం పార్టీకి రాజీనామ చేసి బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. అయితే అనూహ్యంగా ఏమైందో తెలియదు చేరిన మరుసటి రోజు గురువారం అక్కడి నుంచి జంప్ కొట్టి కాంగ్రెస్‌లోకి వచ్చారు. ఇదే అంశం జిల్లా వ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్‌కు అభ్యర్థి కుచాడి శ్రీహరి రావు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని భావించి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో భారీగా వలసలు వస్తున్నారని శ్రీహరిరావ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి, అట్ల రవీందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సమ్మెట రవి, నగేష్ పాల్గొన్నారు.